# రూ. లక్ష దాటితే వివరాలు సమర్పించాలి

- బ్యాంకు లావాదేవీలపై నిఘా ఉండాలి
- యూపీఐ పేమెంట్లపై దృష్టి పెట్టాలి
- బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలావరంగల్, అక్టోబర్ 17: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రూ. లక్షకు పైగా బ్యాంకు లావాదేవీలు నిర్వహించిన వారి వివరాలను సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య బ్యాంకు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్‌తో కలిసి బ్యాంకర్లతో సమీక్షించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున బ్యాంకర్లు కచ్చితంగా పాటించాలన్నారు. ఎవరైనా బ్యాంకు ఖాతాలో రోజూ రూ. లక్ష నగదు డిపాజిట్ చేసినా, విత్‌డ్రా చేసినా, అదేవిధంగా నెలలో రూ. 10 లక్షల పైబడి నగదు డ్రా, ట్రాన్స్‌ఫర్ చేసినా లావాదేవీల వివరాలను రోజూ ఆయా బ్యాంకు అధికారులు ఎన్నికల అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో జరిగే లావాదేవీలపై నిఘా పెట్టాలన్నారు. అలాగే, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ఒకే అకౌంట్‌తో వివిధ అకౌంట్లకు గూగుల్ పే, ఫోన్‌పే ఇతర యాప్‌ల ద్వారా డబ్బులు జమ చేస్తే వాటి వివరాలను కూడా పంపించాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసినట్లయితే జాప్యం చేయకుండా వెంటనే చెక్ బుక్ జారీ చేయాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు.

సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా కోఆపరేటివ్ అధికారి సంజీవ్‌రెడ్డి, లీడ్ బాంక్ మేనేజర్ రాజు, ఎస్బీఐ, సీబీఐ ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, బ్యాంకు ఆఫ్ బరోడా, కెనరా, ఇండియన్ బ్యాంకు చీఫ్ మేనేజర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.



ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

## సద్దుల బతుకమ్మ ఆట స్థల పరిశీలన

ఖిలావరంగల్, అక్టోబర్ 17: తూర్పుకోటలో సద్దుల బతుకమ్మ, రావణ వధ స్థలాలను దసరా ఉత్సవ కమిటీ, అఖిలపక్షం నాయకులు, వివిధ కులాలకు చెందిన పెద్దలు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు బోగి సురేశ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉత్సవాలు ఎమ్మెల్యే నరేందర్ సహకారంతో సాదాసీదాగా జరుగుతాయన్నారు. పార్టీలకతీతంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో జరిగే ఉత్సవ కమిటీలో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ గౌరవ అధ్యక్షురాలిగా, శ్రమశక్తి అవార్డు గ్రహీత బిల్లా శ్రీకాంత్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోయిని దూడయ్య, సంగరబోయిన విజయ్, బిల్లా రవి, చందర్, సిరబోయిన వాసుదేవ్, ఉమేష్, ధర్మరాజ్, కరుణాకర్, బెడద వీరన్న, రఘు, గన్నారపు రమేశ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నరేందర్‌కు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే నరేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సోనుబాబు

కాశీబుగ్గ, అక్టోబర్ 17: వరంగల్‌తూర్పు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బీఫాం అందుకున్న నన్నపునేని నరేందర్‌ను తెలంగాణ జాగృతి వరంగల్ తూర్పు కన్వీనర్ పెండ్యాల సోనుబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.



నన్నపునేనికి విరాళం అందజేస్తున్న సత్యనారాయణ

## బీఆర్‌ఎస్ అభ్యర్థికి విరాళం

కరీమాబాద్, అక్టోబర్ 17: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎంపికైన ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు 41వ డివిజన్ విశ్వనాథకాలనీకి చెందిన రిటైర్డ్ పోలీస్ ఉద్యోగి చెలుమల్ల సత్యనారాయణ మంగళవారం రూ. 2016 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా నన్నపునేని మాట్లాడుతూ ప్రజల ప్రేమాభిమానాలు బీఆర్‌ఎస్, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్నాయన్నారు. తెలంగాణలో మరోసారి బీఆర్‌ఎస్ విజయం ఖాయమన్నారు. విరాళం అందజేసిన సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోశాల పద్మ, నాయకులు పోశాల స్వామి, రమేశ్, భిక్షపతి, కృష్ణ పాల్గొన్నారు.

### అమరవీరులకు నన్నపునేని నివాళి

ఖిలావరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రెండోసారి బీఫాం అందుకున్న నన్నపునేని నరేందర్ సోమవారం రాత్రి ఖిలావరంగల్‌లోని అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పడమరకోటలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. రానున్న ఎన్నికల్లో తూర్పులో గులాబీ జెండా ఎగురవేసి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ర్యాలీలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి



కౌంటర్లను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

వరంగల్, అక్టోబర్ 17: రాజకీయ పార్టీలు ర్యాలీల నిర్వహణ, సమావేశాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనుమతుల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన అనుమతుల కోసం బల్దియా కార్యాలయంలో సువిధ, రాజకీయ పార్టీల హెల్ప్‌డెస్క్, ఎన్నికల కంట్రోల్‌రూం కౌంటర్ల నుంచి రాజకీయ పార్టీలు తమకు కావాల్సిన అనుమతి పొందాలని కోరారు. 48 గంటల ముందు రాజకీయ పార్టీలు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ఏర్పాట్ల పరిశీలన

బల్దియా కార్యాలయంలో ఎన్నికల ప్రత్యేక సెల్ ఏర్పాట్లను బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ పరిశీలించారు. ప్రతి కౌంటర్‌ను పరిశీలించిన ఆయన సమర్థవంతంగా ఎన్నికల నిబంధనలను అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనుమతి కోసం వచ్చే రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరిటెండెంట్ అనంద్, ఎన్నికల డీటీ మధుసూదన్, ఏఎస్‌వో వెంకన్న, సీనియర్ అసిస్టెంట్ మధుచంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా లలితా సహస్రనామ పారాయణం



లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 17: వరంగల్ శ్రీనివాసకాలనీలోని శృంగేరి శంకరమఠంలో శారదా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి విశేష పూజలు అందించారు. ఆలయ ప్రధానార్చకుడు సంగమేశ్వరజోషి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, సాయిగణేశ్‌శర్మ, వివేక్‌శర్మ శారదాంబ అమ్మవారికి, చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం, అర్చన, విశేష పూజలు చేశారు. అలాగే, మహిళలు భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం గావించారు. అనంతరం పుల్లూరు దేవేందర్-పద్మ దంపతులు ఆయుష్య హోమం నిర్వహించారు. అమ్మవారికి మహా మంగళహారతులు పట్టి, అన్నదానం చేశారు. సాయంత్రం లక్ష కుంకుమార్చన జరిపారు. అలాగే, అన్నావఝ్ఝుల సోమశేఖరశర్మ శ్రీదేవి భాగవతం పురాణ ప్రవచనం చేశారు. అనంతరం గజ్జెల రంజిత్‌కుమార్ బృందం నిర్వహించిన పేరిణి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో శృంగేరి సేవా సమితి సభ్యులు రామారావు, మదన్ మోహన్, రాజేంద్రప్రసాద్, మురళీధర్, ఆనంద్‌కుమార్, రాజు, సంధ్యారాణి, రమాదేవి, కల్యాణి, సుకన్యలు పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు'

‘రైతులను ఇబ్బంది పెట్టొద్దు’

కాశీబుగ్గ, అక్టోబర్ 17: సరుకులను మార్కెట్‌లో అమ్ముకొని డబ్బులు ఇంటికి తీసుకెళ్లే రైతులను ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద ఇబ్బంది పెట్టొద్దని వరంగల్ చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్, వరంగల్ సీపీ, ఎన్నికల అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వారి వద్ద ఉన్న చీటీలను చూపెడితే వదిలిపెట్టాలని కోరినట్లు పేర్కొన్నారు.

## రైల్వేస్టేషన్‌లో హ్యాండ్‌బ్యాగ్‌లు స్వాధీనం

ఖిలావరంగల్, అక్టోబర్ 17: వరంగల్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం లేడీస్ హ్యాండ్ బ్యాగ్‌లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ నుంచి దీవాన్ అనే వ్యక్తి రూ. 4.80 లక్షల విలువైన 2800 లేడీస్ హ్యాండ్ బ్యాగ్‌లను వరంగల్‌లో దిగుమతి చేసుకున్నాడు. పార్సిల్ కార్యాలయం నుంచి తరలిస్తుండగా పట్టుకొని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించారు.



నూతన కార్యకర్గ సభ్యులు

## వరంగల్ కూరగాయల మార్కెట్ సొసైటీ నూతన కార్యవర్గం

కాశీబుగ్గ, అక్టోబర్ 17: లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వ్యాపారుల కో ఆపరేటివ్ సొసైటీ సర్వసభ్యుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిట్ల కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎండీ అలీ, ప్రధాన కార్యదర్శిగా సామల రాజు, సహాయ కార్యదర్శిగా నమిండ్ల సూరయ్య, కోశాధికారిగా ఇప్పకాయల మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పారిశుధ్య కార్మికులకు చీరెల పంపిణీ



చీరెలు పంపిణీ చేస్తున్న సంస్థ అధ్యక్షురాలు మల్లిక

పోచమ్మమైదాన్, అక్టోబర్ 17: శ్రీమాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 23వ డివిజన్ కొత్తవాడలోని పారిశుధ్య కార్మికులకు మంగళవారం చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు ముద్దసాని మల్లిక మాట్లాడుతూ సంస్థ తరపున సేవా కార్యక్రమాలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకుని డివిజన్‌లో పని చేస్తున్న మున్సిపాలిటీ కార్మికులందరికీ దుస్తులు పంపిణీ చేసి, అన్నదానం చేసినట్లు తెలిపారు. అలాగే, ఏటా కార్మికులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. అంధుల పాఠశాలలో ప్రతి నెల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి నన్నపునేని సంజీవరావు, కార్యదర్శి నీలారపు శ్రీనివాస్, కోశాధికారి కొత్తగట్టు కళ, నన్నపునేని వనజ, పల్లా లక్ష్మీదేవి, ముద్దసాని రాధిక, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సౌందర్యలహరి పారాయణం చేస్తున్న భక్తులు

## గాయత్రి అలంకారంలో లలితాదేవి

ఖిలావరంగల్, అక్టోబర్ 15: శివనగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో లలితాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా లలితాదేవి మంగళవారం గాయత్రీమాత అలంకరణలో దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా జగద్గురు ఆదిశంకరాచార్యులతో విరచితమైన సౌందర్యలహరి సామూహిక పారాయణం నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ట్రస్టుతోపాటు భక్తులు పాల్గొన్నారు.